క్లుప్తంగా

ఘనంగా నాగుల ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



మొక్కులు చెల్లించుకుంటున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లతిమ్మాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో నాగుల ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి, ప్రతిష్ఠకు ముందు హోమం నిర్వహించారు. అమ్మవారిని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సర్పంచ్ పడిగెల రవీందర్, ఎంపీటీసీ వరద బాబు, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, యాదవసంఘం మండలాధ్యక్షుడు మెండె శ్రీనివాస్ నాయకులు అందె సుభాష్, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్ల పంపిణీ



గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ రేణుక

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అక్కపల్లిలో గొర్రెలకాపరులకు మంజూరైన ఆరు యూనిట్ల గొర్రెలను లబ్ధిదారులకు మంగళవారం ఎంపీపీ పిల్లి రేణుక పంపిణీ చేశారు. గొర్రెల యూనిట్ల పథకాన్ని సద్వినియోగం చేసుకొని, కాపరులు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యాదవ సంఘం ఉమ్మడి మండలాధ్యక్షుడు మెండె శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు సిర్రం నాగరాజు, సర్పంచ్ ముక్క మధుకర్, ఉపసర్పంచ్ ప్రదీప్‌రెడ్డి, గొర్రెలకాపరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు

కోనరావుపేట: దివ్యాంగుల ఫింఛన్‌ను రూ.4,116కు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ ధర్మారంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు చిత్రపటాలకు దివ్యాంగులు క్షీరాభిషేకాన్ని చేశారు. కార్యక్రమంలో అగ్రహారం ఆలయ కమిటీ డైరెక్టర్ సిద్దంశెట్టి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బొడ్డు చంద్రయ్య, నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులను త్వరగా చెల్లించాలి

సిరిసిల్లటౌన్: ధాన్యం డబ్బులను రైతుల ఖాతాల్లో తొందరగా జమచేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పులి లక్ష్మీపతి అన్నారు. మంగళవారం పట్టణంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ భారతీయ కిసాన్‌సంఘ్ బలోపేతానికి రైతుల వద్దకు వెళ్లి సభ్యత్వాలు చేయించాలన్నారు. లక్ష వరకు నూతన సభ్యత్వాలను చేయించే దిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బియ్యంకార్ శ్రీనివాస్, కార్యదర్శి అనిల్‌కుమార్, రాజిరెడ్డి, శ్రీరాములు, సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

బఫర్ జోన్‌లో ఆందోళన

- ఈదుల చెరువు సమీపంలోని ఇళ్లకు రెడ్ మార్క్
- ఖాళీ చేయాలంటున్న అధికారులు
- అప్పుడిచ్చి.. ఇప్పుడు లాక్కుంటున్నారని ఆందోళన చెందుతున్న బాధిత కుటుంబాలు
- న్యాయం చేయాలని వేడుకోలు



రాజీవ్‌నగర్‌లోని ఈదుల చెరువు సమీపంలోని ఇళ్లు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లోని ఈదుల చెరువు సమీపంలోనివి. గతంలో ముష్టిపల్లి గ్రామపంచాయతీలో ఉన్న ఈ స్థలంలో 25 ఏళ్ల నుంచి వందకుపైగా నిరుపేద కుటుంబాలు గుడిసెలు వేసుకొని నివాసముంటున్నారు. 2007–08 మధ్య కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం బాధిత కుటుంబాలకు ఇళ్లకు పట్టాలిచ్చింది. ప్రస్తుతం వీరుంటున్న ఇళ్లకు సంబంధిత అధికారులు రెడ్ మార్క్ వేసి ఖాళీ చేయాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుడు పట్టాలు ఇచ్చి, ఇప్పుడు ఖాళీ చేయమంటున్నారని, తమ బాధను ఎవరికి చెప్పాలో తెలియక దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. తాము ఎక్కడికి వెళ్లి బతకాలని, తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

84 ఇళ్లలో వందకు పైగా కుటుంబాలు

ఈదుల చెరువుకు సమీపంలో ఉన్నందున ఈ ప్రదేశం బఫర్ జోన్ కిందికి వస్తుందని, ఇక్కడ నివసిస్తున్న దాదాపు 84 ఇళ్లకు రెడ్ మార్క్ వేసినట్లు బాధిత కుటుంబాలు తెలుపుతున్నాయి. దశాబ్దాల కాలం నుంచి ఇంటి పన్నుతో పాటు, అన్ని రకాల పన్నులు వసూలు చేసి ఇప్పుడు అక్రమ నిర్మాణాలు అని తొలగించాలని చూడడం సరైంది కాదని బాధితులంటున్నారు. అప్పటి ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇస్తే ఇల్లు కట్టుకున్న వీరు ప్రస్తుతం ఉన్న ఇళ్ల ఖాళీ చేయాలని చెప్పడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఆందోళనలో బాధితులు

ఇళ్లు ఖాళీ చేయాలని కొన్ని నెలల క్రితం అధికారులు 84 ఇళ్లకు సంబంధిత అధికారులు ఆదేశించారు. వర్షాకాలం కావడంతో చెరువు బ్యాక్ వాటర్‌లో ముంపుకు గురయ్యే దాదాపు 30కి పైగా కుటుంబాలను ఖాళీ చేయాలని సూచించారు. దీంతో బాధిత కుటుంబాలు ఆందోళలో చెందుతున్నారు. ఉన్నపళంగా తాము ఎక్కడికి వెళ్లాలని ఆవేదన చెందుతున్నారు. గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా ఉన్న నీతూ ప్రసాద్ రాజీవ్‌నగర్‌ని దత్తత చేసుకోగా, చెరువు కరకట్ట కడుతారని అప్పటి అధికారులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పుడు ఖాళీ చేయడం సరికాదని, కరకట్ట కట్టి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆదేశాలు జారీ చేయలేదు



వర్షాకాలంలో చెరువు బ్యాక్ వాటర్‌తో సమీపంలోని ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు ఎన్ని ఇళ్లు ముంపుకు గురవుతున్నాయో అంచనా వేసినట్లు మా దృష్టికి వచ్చింది. ప్రస్తుతం మా నుంచి ఇళ్లు ఖాళీ చేయాలని వారికి చెప్పలేదు.

– సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్

ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం



25 ఏళ్ల నుంచి ఇక్కడే ఇల్లు కట్టుకొని ఉంటున్నాం. పట్టా కూడా ఉంది. గ్రామ పంచాయతీ ఉన్నప్పటి నుంచి ప్రస్తుతం మున్సిపల్ వరకు ఇంటికి సంబంధించి అన్ని పన్నులు కడుతున్నాం. ఇప్పుడు ఖాళీ చేయాలంటే ఎక్కడికి వెళ్తాం. వర్షాకాలం వచ్చినప్పుడల్లా అధికారులు ఇబ్బందులు గురిచేస్తున్నారు. ఖాళీ చేయాలని ఇళ్లకు రెడ్‌మార్క్ వేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

– దీకొండ మీనాక్షి, కాలనీవాసి

కరకట్ట నిర్మించాలి



2007–08 మధ్య కాలంలో అప్పటి ప్రభుత్వం ఇళ్లకు సంబంధించి పట్టాలు ఇచ్చారు. అప్పటి నుంచి మేము నా ఇద్దరు కుమారులతో ఇక్కడే ఉంటున్నాం. అదే ఇంట్లో 8 మందికిపైగా కుటుంబ సభ్యులం నివాసముంటున్నాం. ఇప్పుడు ఖాళీ చేస్తే ఎక్కడ ఉండాలి. ఈదుల చెరువుకు కరకట్ట నిర్మిస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారు. కరకట్ట నిర్మిస్తే వందల కుటుంబాలు ఆదుకున్నట్లు అవుతుంది.

– ఆకుబత్తిని పుష్ప కాలనీనివాసురాలు

రోడ్డున పడుతారు



పనిచేస్తే పూట గడవని పరిస్థితిలో ఉన్న కుటుంబాలను ఇలా ఖాళీ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడం సరికాదు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు పట్టాలు ఇచ్చింది. ఇప్పుడున్న ప్రభుత్వం అన్ని రకాల పన్నులను వసూలు చేస్తూ ఇళ్ల నుంచి వెళ్లగొట్టాలని చూడడం సరికాదు. కరకట్ట నిర్మించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి.

– సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు

ఇళ్లకు రెడ్ మార్క్ వేశారు



రాజీవ్‌నగర్‌లోని ఈదుల చెరువు సమీపంలోని దాదాపు 84 ఇళ్లకు అధికారులు కొన్ని నెలల క్రిందట రెడ్ మార్క్ వేసి ఖాళీ చేయాలని సంవత్సర కాలం నుంచి ఇబ్బంది పెడుతున్నారు. దాదాపు వందకు పైగా నిరుపేదల కుటుంబాలు ఉన్నాయి. వీరంతా ఎక్కడికి పోవాలి. ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి కరకట్టను నిర్మించాలి.

– అక్కెన సతీశ్‌కుమార్, కాలనీ వాసి

18న ఆన్‌లైన్ క్విజ్

సిరిసిల్లటౌన్: ఈనెల 18న కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో విద్యార్థులందరూ పాల్గొనాలని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు కళాశాలలను సందర్శించి విద్యార్థులతో మంగళవారం మాట్లాడారు. 16 నుంచి 35లోపు ఉన్నవారు అర్హులని, రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 17 చివరి తేదీ అని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల భాను, జిల్లా కార్యదర్శి ఆకిన సతీశ్, ఏగుర్ల ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇల్లు కూలింది.. ఆదుకోండి



ఆదుకోవాలని వేడుకుంటున్న కిరణ్ కుటుంబం

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామానికి చెందిన బొమ్మన కిరణ్ సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం తన కుటుంబం నివసిస్తున్న పాత ఇల్లు హఠాత్తుగా కూలిపోవడంతో ముగ్గురు పిల్లలతో రోడ్డున పడ్డారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఇంటి నిర్మాణానికి అండగా నిలవాలని వేడుకుంటున్నారు. దాతలు సాయం చేయాలని కోరారు.

పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు అడ్డగింత



నాయకుల వాగ్వాదం

చందుర్తి: నియోజకవర్గంలోని రుద్రంగి, భీమారం మండలాలకు 30 పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసి, చందుర్తి మండలానికి 10 పడకల ఆసుపత్రికి నిధులు మంజూరు చేసి వివక్ష చూపారని చందుర్తి సర్పంచ్ భర్త సిరికొండ శ్రీనివాస్, ఎంపీటీసీ భర్త పులి సత్తయ్య, ఉపసర్పంచ్ సిర్రం తిరుపతి ఆరోపించారు. 30 పడకల ఆసుపత్రిని చందుర్తి మండల కేంద్రంలో నిర్మించాలంటూ డిమాండ్ చేశారు. మంగళవారం 10 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్ ఘటన స్థలానికి చేరుకున్నారు. తరుచూ పనులను అడ్డుకుంటూ అభివృద్ధికి అడ్డు తగులుతున్నారంటూ నిలదీశారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం తారాస్థాయికి చేరుకుంది. ఎస్సై రమేశ్ సర్దిచెప్పినా వినలేదు. సీఐ కిరణ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకొని అభివృద్ధి పనులను ఎవరు అడ్డుకున్నా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల ఎదుటే బాహాబాహీకి దిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించడంతో ఇరువర్గాలవారు అక్కడి నుంచి వెళ్లిపోగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు.

సంక్షిప్త వార్తలు

గోశాలలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: తిప్పాపూర్ గోశాలలోని కోడెలను మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలోని శ్రీగోమాత గోశాలకు, నెల్లికుదురు మండలం ఎర్రబెల్లిగూడెంకు చెందిన శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ గోశాలకు 20 చొప్పున మంగళవారం అందజేశారు. ఆలయ అధికారులు శ్రీనివాస్, హరిహరనాథ్, శ్యామ్ ఉన్నారు.

భూమిపూజ

చందుర్తి: మండలంలోని మల్యాలలోని గూండ్లవానిపల్లెలో లోవోల్టేజీ సమస్య పరిష్కరించేందుకు విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు మంగళవారం భూమిపూజ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఇల్లంతకుంట: మండలంలోని రేపాక గ్రామానికి జి.ప్రసాద్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.24వేలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ బాధితుడికి అందజేశారు.

వసతులు కల్పించాలి

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్నబోనాల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వసతులు కల్పించాలని కౌన్సిలర్ బోల్గం నాగరాజ్‌గౌడ్ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

జంగమయ్య గుట్టకు రోడ్డు నిర్మించాలి

గంభీరావుపేట: మండల కేంద్రంలోని జంగమయ్య గుట్టపై గల శివాలయానికి వెళ్లేందుకు రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తాత్కాలిక రోడ్డు నిర్మించాలని రైతులు స్థానిక సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులుకు వినతిపత్రం అందించారు.

రుణాల పథకంలో ముదిరాజ్‌లను చేర్చాలి

గంభీరావుపేట: బీసీ రుణాల పథకంలో ముదిరాజ్‌లను చేర్చాలని ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు శివంది దేవేందర్ డిమాండ్ చేశారు.

దశాబ్ది వేడుకలు



కోనరావుపేట ముగ్గులు వేస్తున్న మహిళలు



బహుమతి అందజేస్తున్న సీఐ, ఎస్సైలు



గురుకులంలో వీడియో తిలకిస్తున్న విద్యార్థులు



మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు



పాఠశాలలో శ్రమదానం చేస్తున్న పోలీసులు



రాళ్లపేటలో మహిళలకు సన్మానం

ముగ్గుల పోటీలు

చందుర్తి/ఇల్లంతకుంట/బోయినపల్లి/కోనరావుపేట/ఎల్లారెడ్డిపేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని మండల కేంద్రాల్లో పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. చందుర్తి రైతు వేదికలో సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రమేశ్, ఇల్లంతకుంట వైశ్య భవన్‌లో ఎస్సై రాజేశ్, బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మామిడి మహేందర్, కోనరావుపేటలో ఎస్సై రమాకాంత్, ఎల్లారెడ్డిపేటలో ఎస్సై ప్రేమ్‌దీప్, గంభీరావుపేట కేజీ టు పీజీ ప్రాంగణంలో ఎస్సై మహేశ్, వీర్నపల్లి ఎస్సై నవత ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

తంగళ్లపల్లి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో మంగళవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించి గ్రామాభివృద్ధికి కృషి చేసిన మహిళలను సన్మానించారు.

విద్యార్థినులకు నోట్‌బుక్స్ పంపిణీ

స్థానిక మైనార్టీ పాఠశాలలో మంగళవారం ప్రభుత్వం నుంచి అందిస్తున్న నోట్‌బుక్స్‌ను ఎంపీపీ పడిగెల మానస, సర్పంచ్ అనిత పంపిణీ చేశారు.

వీడియో ప్రదర్శన

మండలంలోని బద్దెనపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులు సాధించిన విజయాలను, సాంస్కృతిక కార్యక్రమాల ఫోటో గ్యాలరీ వీడియో రూపంలో ప్రదర్శించారు. ఎంపీపీ పడిగెల మానస, ఎంపీటీసీ సిలివేరి ప్రసూన, ప్రిన్సిపాల్ పద్మ పాల్గొన్నారు.

శ్రమదానం

సిరిసిల్లఅర్బన్: తుపాకులు పట్టిన చేతులు పలుగు పార పట్టి శ్రమదానం చేశాయి. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 17వ పోలీస్ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ జయరాజు ఆధ్వర్యంలో సర్దాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో పోలీస్ సిబ్బంది శ్రమదానం చేపట్టారు. పాఠశాలలోని చెత్త చెదారం, ముళ్లపొదలు, పిచ్చి మొక్కలను తొలగించారు. పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ పార్థసారథి 9వ వార్డు కౌన్సిలర్ సత్యనారాయణ, ఆర్ఐలు నారాయణ, శంకర్, శ్రీనివాస్, రాజేందర్ పాల్గొన్నారు.

విద్యార్థుల మానవహారం

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు కళాశాల ముందు మానవహారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయాలపై ఫోటో ప్రదర్శన జరిగింది. ఆనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మజ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



రుణాల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు
- మహిళా సంఘాలకు రూ. 13.59 కోట్ల రుణాలు అందజేత
- ఘనంగా మహిళా సంక్షేమ దినోత్సవం

వేములవాడ: మహిళలను మహారాణులను చేసేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందని ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక మహారాజ ఫంక్షన్ హాలులో జరిగిన మహిళా సంక్షేమ దినోత్సవంలో మంగళవారం ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఆడపడచుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ క్రమంలో అంగన్‌వాడీ బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.17 వేల కోట్ల రుణాలు కేటాయించిందన్నారు. శిశు మరణాలను గణనీయంగా తగ్గించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మహిళల పొదుపు శాతం గణనీయంగా పెరిగిందన్నారు. నియోజకవర్గంలో గడచిన మూడేళ్లలో 7,918 మంది లబ్ధిదారులకు రూ.79 కోట్ల కల్యాణలక్ష్మి అందజేసినట్లు తెలిపారు. రూ.9 కోట్లు వడ్డీ లేని రుణాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, జెడ్పీటీసీలు ఏశ వాణి, మ్యాకల రవి, ఎంపీపీలు గంగం స్వరూప, ఉమాదేవి, లావణ్య, బూర వజ్రమ్మ, జివ్వాజి రేవతి, ఏఎంసీ చైర్మన్లు రమ్య, సౌజన్య, సెస్ డైరెక్టర్ నామాల ఉమ పాల్గొన్నారు.

చెక్కపల్లి కార్యదర్శికి సత్కారం

వేములవాడరూరల్: మూడుసార్లు ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైన వేములవాడ మండలంలోని చెక్కపల్లి గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పనిచేస్తున్న గడ్డం చందనను ఎమ్మెల్యే రమేశ్‌బాబు మంగళవారం శాలువాతో సత్కరించారు.

ఎమ్మెల్యేను కలిసిన బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

వేములవాడ: స్థానిక బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం మంగళవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు, ఏజీపీ గుడిసె సదానందం, ఉపాధ్యక్షుడు గడ్డం సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి నక్క దివాకర్, లైబ్రరీ కార్యదర్శి గుజ్జ మనోహర్, కార్యవర్గసభ్యులు గంగరాజు, నర్సింగారావు, గంప రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'విద్యార్థుల జీవితాలతో చెలగాటం'



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని రుద్రవరం గ్రామంలో మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక పేద, మధ్య తరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మృగశిరకార్తె మొదలైనా వరిధాన్యం కొనుగోళ్లు ఇంకా పూర్తికాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పంట పొలాల్లో ఉండాల్సిన రైతులు వడ్ల కల్లాల్లోనే ఉంటున్నారని, ప్రారంభంలోనే కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు ఇప్పటికీ రైతుల ఖాతాల్లో జమ కాకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తప్పనిసరిగా గెలిచి బడుగు, బలహీన వర్గాలు, ముంపు గ్రామాల ప్రజలకు అండగా నిలుస్తామన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, వకుళాభరణం శ్రీనివాస్, కత్తి కనుకయ్య, ఎర్రం ఆగయ్య, ఎర్రం రాజు, శ్రీనివాసరావు, చంద్రగిరి శ్రీనివాస్, చిలివేరి శ్రీనివాస్, రమేశ్ తదితరులు ఉన్నారు.

సర్టిఫికెట్ల కోసం యువత పాట్లు



మీసేవలో దరఖాస్తు చేస్తున్న యువతీయువకులు

కోనరావుపేట: ప్రభుత్వం ప్రకటించిన బీసీ కులాలకు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకునే యువకులు సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోని బీసీలలో 15 కులాలకు చెందిన వారికి వృత్తి పనుల కోసం రూ.లక్ష ఆర్థికసాయం అందిస్తామని ప్రకటిస్తూ, మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 20 వరకే గడువు ఉండడంతో మండలంలోని 28 గ్రామాలకు చెందిన యువతీ, యువకులు మీ సేవలకు పరుగులు పెడుతున్నారు. ఇందుకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాల కోసం ఒక్కసారిగా రావడంతో మీ సేవ సెంటర్లు కిక్కిరిసి పోతున్నాయి. కాగా తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐలు, సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. స్థానిక మీసేవ కేంద్రాల్లో, కార్యాలయంలో కలిపి 350 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఏప్రిల్, 2021 తర్వాత తీసుకున్న ఆదాయ ధ్రువీకరణపత్రంతో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్ దారు రవికాంత్ తెలిపారు. ఇద్దరు ఆర్ఐలను, సిబ్బందిని ఈవీఎంల పరిశీలన డ్యూటీకి వెళ్లారని, గురువారంలోగా విధుల్లో చేరుతారని తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో దరఖాస్తు చేసుకున్న వారందరి సర్టిఫికెట్లు అందజేస్తామని, యువకులు ఆందోళన చెందొద్దని అన్నారు.

15న నర్సింగ్ ఉద్యోగావకాశాలపై వర్క్‌షాప్

సిరిసిల్లకల్చరల్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ఆధ్వర్యంలో విదేశాల్లో నర్సింగ్ సంబంధిత ఉద్యోగాలకు అవకాశాలున్నాయని జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ తెలిపారు. ఆయా దేశాల్లో నర్సింగ్ ఉద్యోగాల సాధన సులభతరం చేసేందుకు ఈ సంస్థ ప్రయత్నిస్తోందన్నారు. అమెరికా, కెనడా, జపాన్, ఆస్ట్రేలియా, యుకే ఇతర యూరప్ దేశాల్లో నర్సింగ్, అనుబంధ ఆరోగ్య సంరక్షకులకు ఉన్న డిమాండ్ మేరకు అర్హులైన అభ్యర్థులకు శిక్షణ, భాషా నైపుణ్యాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 15న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్‌కళాశాలలో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తితో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు నవీకరించిన బయోడేటాతో వర్క్‌షాప్‌నకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 63022 92450 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.